సాక్షి నల్లగొండ

మంగళవారం | 8 | అక్టోబర్ | 2024



రుణం ఇప్పిస్తామని..

తక్కువ వడ్డీకే ఎక్కువ రుణం ఇప్పిస్తామని మోసం చేస్తున్న ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్టు చేశారు.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 50.739 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 50.739 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28.623 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10.040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 9.076 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2.400
వరద కాల్వకు	: 600

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2.145 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1588.98 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 170.73 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 317.02 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

9న జాబ్‌మేళా

నల్లగొండ : నల్లగొండలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 9న ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ కంపెనీల్లో, విదేశీ ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీల్లో ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రికల్), డిగ్రీ, పీజీ పూర్తయి 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 70956 12963 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : సమాచార హక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ పూర్ణచందర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 19 సంవత్సరాల పూర్తి చేసుకుందన్నారు. అనంతర సమాచార హక్కు సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, సైదులు, మేకల శ్రీహరి, కాడబోయిన సాయి, మల్లయ్య, శంకర్, రాంబాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

నల్లగొండ క్రైం : పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 35 మంది అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యల పైన ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తామన్నారు.

దేవాలయ ధర్మకర్తల మండలికి దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలని దేవాదాయ సహాయ కమిషనర్ అనపర్తి సులోచన సోమవారం ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేశారు. దరఖాస్తుల చేసుకోవాల్సిన ఆలయాలు ఇలా.. శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం (చిట్యాల), శ్రీ బాలలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం (చిట్యాల మండలం), శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం (పేరేపల్లి), శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం (వట్టిమర్తి), రామలింగేశ్వర స్వామి దేవస్థానం (గుండ్రాంపల్లి), ఆంజనేయ స్వామి దేవాలయం (ఈదులూరు), శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం (కట్టంగూర్), శివ మహాదేవ దేవాలయం (కేతేపల్లి మండలం), వేంకటేశ్వర స్వామి దేవాలయం (గుడివాడ), శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం (నకరేకల్ మండలం), శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయం (చందుపట్ల), లింగమంతుల స్వామి దేవాలయం (నకరేకల్ మండలం), శ్రీ గోరక్షక స్వామి దేవాలయం (గొరెంకలపల్లి), విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయం (నకిరేకల్), శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం (శాపల్లి), ఆంజనేయ స్వామి దేవాలయం (ఎల్లారెడ్డిగూడెం) వేణుగోపాల స్వామి దేవాలయం (నార్కట్‌పల్లి) ఈ ఆలయాల్లో ధర్మకర్తల మండలికి 20 రోజుల్లోగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

సీపీఎస్ విధానం రద్దుకు పోరాటం

నల్లగొండ : సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ త్వరలో పోరాట కార్యాచరణ చేపట్టనున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీవీఎస్.ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి జాన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించి 10నెలలు గడిచినా దాని ఊసెత్తడం లేదని పేర్కొన్నారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలని, దసరా కానుకగా డీఏలు ప్రకటించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు.



అలరించిన కళారూపాలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణం రాక్‌హిల్స్ కాలనీలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం రాత్రి మహిషాసురమర్ధిని నాటకం, శాస్త్రీయ నృత్యాలు నిర్వహించారు. ఈ కళారూపాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

విద్యా సౌధాలు

ఉమ్మడి జిల్లాలో మూడు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు

- నల్లగొండ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఏర్పాటు
- ఒక్కో దాంట్లో 2,560 మంది విద్యార్థులకు ప్రవేశం
- పూర్తయిన భూ సేకరణ.. ఈనెల 11వ తేదీన శంకుస్థాపన
- సకల సౌకర్యాలతో నిర్మాణం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కులమతాలకు అతీతంగా విద్యార్థులంతా ఒకేచోట విద్యను అభ్యసించేలా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో విద్యార్థులు వసతితో పాటు బోధనాపరంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మానవ వనరులు ప్రపంచంలో పోటీ పడేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఒకేచోట గురుకులాలను నిర్మించి, విద్యార్థులకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ మూడు చోట్ల గురుకులాల ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ భవనాలను వచ్చే ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల..

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్‌లో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద 19 చోట్ల సమీకృత గురుకులాలను నిర్మించేందుకు ఈ నెల 11వ తేదీన భూమి పూజ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వాటిల్లో ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ సమీపంలో..

ఒక్కో గురుకులాన్ని 20 నుంచి 25 ఎకరాల విశాలమైన స్థలంలో నిర్మించబోతోంది. నల్లగొండ నియోజకవర్గంలో నిర్మించబోయే గురుకులానికి సంబంధించి అధికారులు స్థల పరిశీలన, ఎంపికను పూర్తి చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎస్ఎల్‌బీసీ ప్రాంతంలో రెండు నెలల కిందటే 20 ఎకరాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరో 5 ఎకరాలు కావాలని ఆదివారం ఆదేశాలు రావడంతో ఆ ఐదు ఎకరాలను అదేచోట గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈనెల 11వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని వెల్లడించారు.

గడ్డిపల్లి, తొండ గ్రామాల్లో..

ఇక సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మరో గురుకులాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దాని కోసం నియోజకవర్గంలోని గరిడేపల్లిలో మండలం గడ్డిపల్లి శివారులో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. మరోవైపు కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండలం సీతారాంపురం వద్ద కూడా 22 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. అయితే వాటిల్లో హుజూర్‌నగర్‌లో ఏర్పాటుకే ప్రభుత్వం మొగ్గుచూపినట్లు అధికారులు పేర్కొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరి మండలం తొండ రైతు వేదిక సమీపంలోని 24 ఎకరాల ప్రభుత్వ భూమిలో గురుకులాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఒకటి రెండు రోజుల్లో భూములను ఖరారు చేసి, 11వ తేదీన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

ఒకే చోట నాలుగు గురుకులాలు

ఈ ఇంటిగ్రేటెడ్ గురుకుల ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన నాలుగు గురుకులాలను నాలుగు బ్లాక్‌లుగా ఒకే చోట నిర్మించనున్నారు. 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు వీటిలో విద్యనభ్యసించనున్నారు. ఒక్కో బ్లాక్‌లో 640 మంది చొప్పున 2,560 మంది విద్యార్థులు విద్యనభ్యసించే విధంగా వీటి నిర్మాణం చేపట్టనున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పించనున్నారు. వీటి ద్వారా ఏటా ఉమ్మడి జిల్లాలో మరో 7,680 మంది విద్యార్థులకు గురుకుల విద్య అందుబాటులోకి రానుంది.

కల్పించనున్న సదుపాయాలు ఇలా..

విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేలా ఈ గురుకులాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. అదే ప్రాంగణంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణం, ఇన్నోవేటివ్ బోధనా విధానం ఉండేలా ఏర్పాటు చేయనున్నారు. సోలార్ సిస్టమ్ ఏర్పాటుతో పాటు తరగతి గదులు, లేబోరేటరీలు, కంప్యూటర్ సెంటర్, లైబ్రరీ, ఆడిటోరియం, వసతి గృహం, డైనింగ్, కిచెన్, బహుళ వినియోగ హాస్టళ్లు, క్లబ్‌లు, వైద్యశాల, ఇండోర్ గేమ్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్ బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, అవుట్‌డోర్ జిమ్, ల్యాండ్ స్కేప్ కోర్టువంటివి ఈ గరుకులాల్లో ఉండనున్నాయి.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రమాణ స్వీకారం చేస్తున్న దేవరకొండ మార్కెట్ నూతన పాలకవర్గం, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

- మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- దేవరకొండ, మాల్ మార్కెట్ కమిటీల ప్రమాణస్వీకారం

దేవరకొండ, చింతపల్లి : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ, చింతపల్లి మండలం మాల్ వెంకటేశ్వరనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. జిల్లా ప్రజల చిరకాల స్వప్నం ఎస్ఎస్‌బీసీ సొరంగం పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం టన్నెల్ పనులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అప్పట్లో రూ.2వేల కోట్లు కేటాయిస్తే సొరంగం పనులు పూర్తయ్యేవని పేర్కొన్నారు. కమీషన్ల కోసం కాళేశ్వరం మీద పెట్టిన శ్రద్ధనక్కలగండిపై పెట్టకపోవడంతో నేడు అంచనా వ్యయం భారీగా పెరిగిందన్నారు. మూసీ ప్రక్షాళన చేపట్టి అక్కడి ప్రజల బాధలు తీర్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తుంటే హరీశ్‌రావు,కేటీఆర్ అడ్డుపడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఎవరు అడ్డొచ్చినా ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేసి తీరుతుందని స్పష్టం చేశారు. ఆర్అండ్‌బి ద్వారా జిల్లాకు రూ.516 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నూతనంగా కొలువుదీరిన మార్కెట్ పాలకవర్గాలు రైతులకు అన్ని విధాలులుగా అండగా నిలవాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ మాట్లాడుతూ డిండి లిఫ్ట్ స్కీం పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని దాదాపు 3లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు జిల్లా మంత్రుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని అన్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నాయిని జమునా మాధవరెడ్డి, వైస్ చైర్మన్ సర్వయ్య యాదవ్, మాల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆలంపల్లి నర్సింహ, సిరాజ్‌ఖాన్, వేణుధర్‌రెడ్డి, కృష్ణయ్య, జాన్‌యాదవ్, రుక్మారెడ్డి, బిక్కునాయక్, సురేష్‌గౌడ్, యూనూస్, నాగభూషణం, గోవర్ధన్, పవన్ కుమార్, భాస్కర్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాల్‌లో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొంటూ.. క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి ఆకాంక్షించారు. సోమవారం నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ - 14, 17 బాల బాలికల తైక్వాండో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణకు ఉపయోగ పడుతుందన్నారు. ఈనెల 17న జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి ఉమ్మడి జిల్లాకు పేరు తేవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వాసుదేవరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, గఫార్, వెంకన్న, అంబేద్కర్, కోచ్‌లు యాకస్వామి, యూనస్, ప్రణీత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న పాలడుగు సుధాకర్

నల్లగొండ టౌన్ : గ్రామ పంచాయతీ కార్మికులను పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. అర్హత గల కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.లక్ష్మీనారాయణ, నాయకులు పోలె సత్యనారాయణ, వినోద్‌కుమార్, ఏర్పుల సైదులు, టి.సర్వయ్య, ఎర్ర అరుణ, కె.స్వప్న, లింగయ్య, మంగారెడ్డి, నర్సయ్య, జానయ్య, రామలింగయ్య, చంద్రయ్య, మరియమ్మ, ఏసు పాల్గొన్నారు.

పథకాల అమలును వేగవంతం చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ప్రభుత్వ పథకాల అమలును వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 23 పత్తి కొనుగోలు కేంద్రాలను ఈనెల 15లోగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణలో భాగంగా రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పహాణీ, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల ఆధారంగా 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించాలని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను పరిశీలించి చెక్కుల పంపిణీకి సిద్ధం చేయాలని ఆదేశించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యానికి వేరువేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ధాన్యం మద్దతు ధర్పై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ధాన్యం మద్దతు ధర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 56 ఫిర్యాదులు రాగా వాటిలో రెవెన్యూ సంబంధించినవి 16, ఇతర శాఖలకు సంబంధించి 40 ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

మహిళా సంఘాలకు పార్కులు, నీటి సరఫరా నిర్వహణ

- త్వరలో నల్లగొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లో అమలు



నల్లగొండ టూటౌన్ : పట్టణాల్లోని పొదుపు సంఘాల మహిళలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అమృత్ స్కీం పట్టణాల్లోని పార్కులు, తాగునీటి సరఫరా, మోటర్ల మరమ్మతులు తదితర బాధ్యతలను వారికి అప్పగించాలని నిర్ణయించింది. మహిళలకు అప్పగించడం వల్ల మెరుగైన పని విధానం అమలు కావడంతో పాటు కొంత మందికి ఉపాధి దొరుకుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ఇప్పటికే ఇప్పటికే మెప్మా సిబ్బందికి హైదరాబాద్‌లో ఒకరోజు శిక్షణ కూడా పూర్తి చేశారు. జిల్లాలోని ప్రధాన మున్సిపాలిటీలైన నల్లగొండ, మిర్యాలగూడలో తొలుత దీనిని అమలు చేయనున్నారు.

మిర్యాలగూడలో శిక్షణ పూర్తి

పట్టణాల్లో తాగునీటి పనులు, నీటి ట్యాంకులు, పార్కుల నిర్వహణ తదితర పనులను కాంట్రాక్టర్లతో చేయిస్తుంటారు. అమృత్ స్కీం కింద చేపడుతున్న ఈ పనులను ఇప్పటి నుంచి మహిళలతో చేయించనున్నారు. నల్లగొండలో మూడు పార్కులు, నీటి మోటార్ల నిర్వహణ, తాగునీటి పరీక్షలు చేయడం, మిర్యాలగూడలో నాలుగు పార్కులు, మూడు తాగునీటి ట్యాంకులను పొదుపు మహిళలకు అప్పగించనున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇప్పటికే పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చారు. పనుల అప్పగింతపై వారికి త్వరలోనే ఉత్తర్వులు అందజేయనున్నారు.

ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా..

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్కూల్ విద్యార్థులకు యూనిఫాం కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించిన విషయం తెలిసిందే. ఇలా మహిళలు చేయగలిగే పనులను వారికే అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి ఆ తరువాత ఎక్కువ పనులు మహిళా సభ్యుల ద్వారానే చేయించే ఆలోచన చేస్తోంది. ప్రస్తుతం ఒకపూట చొప్పున పని చేయించే విధానం అమలు చేసి రాబోవు రోజుల్లో పూర్తిస్థాయిలో పని చేయించే అవకాశం ఉంది.

మహిళలకు ఉపాధి దొరుకుతుంది



అమృత్ స్కీం ద్వారా మున్సిపాలిటీల్లో వివిధ పనులు చేయించి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. పార్కులు, తాగు నీటి మోటార్లు, ఎస్టీపీ తదితర పనుల్లో మహిళా సంఘాలను ఉపయోగించాలని నిర్ణయించాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

పంచాయతీలను దత్తత తీసుకుంటాం

పెద్దవూర : అభివృద్ధిలో వెనుకబడిన గ్రామపంచాయతీలను గుర్తించి దత్తత తీసుకుంటామని టీఎన్జీవోస్ (తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్) జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శుల పనితీరు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, పెద్దవూర మండలాల్లోని పలు గ్రామపంచాయతీలను ఆయన సందర్శించారు. అనంతరం పుల్లిచర్ల మురళి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. నిధుల కొరతతో అభివృద్ధి పనులు ఆగిపోయినట్లు పంచాయతీ కార్యదర్శులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.శేఖర్‌రెడ్డి, వంగూర్ విజయ్‌కృష్ణ, ఆకునూరి లక్ష్మయ్య, దశరథ, సైదులు, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు సతీష్, నాగరాజు, లింగయ్య, రాజు, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మారణకాండను వెంటనే ఆపాలి



నల్ల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

నల్లగొండ టౌన్ : పాలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను ఆపేందుకు భారత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సుభాష్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో పాలస్తీనా అతలాకుతలం అయిందన్నారు. యుద్ధం వల్ల 41 వేల మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుమ్మల వీరారెడి, నారి ఐలయ్య, ఎల్.శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, బండ శ్రీశైలం, జి.రామచంద్రం, చిన్నపాక లక్ష్మీనారాయణ, టి.వెంకటేశ్వర్లు, ఎండీ.సలీం, నర్సింహ, గంజి మురళిదర్, రామలింగయ్య, పి.నర్సిరెడ్డి, మురళి, పద్మ, సత్తయ్య, లెనిన్, సుజాత, భిక్షం, మహేష్, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బీబీనగర్‌: కుటుంబ సమస్యలతో మానసిక ఒత్తిడికి లోనైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బీబీనగర్‌ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం ఎస్‌ఐ రమేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద గ్రామానికి చెందిన జిరిగె సునీల్‌కుమార్‌(34) బీబీనగర్‌ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అద్దెకు ఉంటూ స్థానికంగా మాజీ ఎంపీటీసీకి చెందిన ఫాంహౌజ్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా సునీల్‌కుమార్‌ మానసిక ఒత్తిడికి లోనై ఆదివారం రాత్రి అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న సంజీవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


పెదబీరయ్య

గుండాల: మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన కేమిడి పెదబీరయ్య కనిపించడం లేదని అతడి కోడలు అనిత సోమవారం గుండాల పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన పెదబీరయ్య హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు పక్కింటి వారికి చెప్పాడని, నాలుగు రోజులుగా ఎంత వెతికినా అతడి జాడ తెలియ లేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

గరిడేపల్లి: మండలంలోని కల్మలచెర్వు, కాల్వపల్లి గ్రామాలకు చెందిన అనంతు ప్రమీల, తడకమల్ల పవీణ్‌, కొల్లి ఆశీర్వాదం తమ సెల్‌ఫోన్లు పోయాయని పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్‌ యాప్‌ ద్వారా సెల్‌ఫోన్లను కనిపెట్టి సోమవారం గరిడేపల్లి పోలీస్‌ స్టేషన్‌లో వారికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేష్‌ తెలిపారు.

తక్కువ వడ్డీకే రుణం ఇప్పిస్తామని కుచ్చుటోపీ

- రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన ముఠా సభ్యులు
- ఏడుగురి అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌, చిత్రంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తదితరులు


స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్లు

నల్లగొండ క్రైం: బ్యాంకు అధికారులమంటూ రైతులను నమ్మించి తక్కువ వడ్డీకే ఎక్కువ రుణం ఇప్పిస్తామని మోసం చేస్తున్న ఏడుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ తన కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం వెలుగుగూడెం గ్రామానికి చెందిన కట్టెబోయిన పరమేష్‌, తెప్పలమడుగుకు చెందిన పల్లె బోయిన నాగరాజు అలియాస్‌ నాగార్జున, మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంకు చెందిన మమ్ముల జ్యోతిస్వరూప్‌ అలియాస్‌ మణి అలియాస్‌ రాజేష్‌, నార్కట్‌పల్లి మండలం లింగోటం గ్రామానికి చెందిన షేక్‌ వజీర్‌, నార్కట్‌పల్లి గ్రామానికి చెందిన ముప్పిడి సైదులు, మాడ్గులపల్లి మండలం చిరుమర్తి గ్రామానికి చెందిన కొండా శ్రీను అలియాస్‌ శ్రీనివాస్‌, మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన గోగుల సురేష్‌ అలియాస్‌ రమేష్‌, మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన చిలుముల సైదులు కలిసి ముఠాగా ఏర్పడి బ్యాంకు అధికారులుగా, ఫీల్డ్‌ ఆఫీసర్లుగా చెలామణి అవుతూ తక్కువ వడ్డీకి ఎక్కువ రుణం ఇప్పిస్తామని రైతులను నమ్మించారు. నల్లగొండ జిల్లాలోని పెద్దవూర, తిరుమలగిరి(సాగర్‌), నిడమనూరు, నేరడుగొమ్ము, దేవరకొండ, పెద్దఅడిశర్లపల్లి మండలాల్లోని 28 మంది రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్‌ పహాణీలు, రుణం పొందేందుకు కావల్సిన అన్ని ధ్రువపత్రాలను సేకరించి ఒక్కో రైతు నుంచి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. ఏడాది కాలంగా ఈ ముఠా సభ్యులు రైతులను మోసగిస్తూ డబ్బులు వసూలు చేసి తమ చిరునామా మారుస్తూ తప్పించుకుంటున్నారు. పలువురు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు నిందితులను వారి నివాసాల్లో అరెస్ట్‌ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.1.65లక్షల నగదు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న మిర్యాలగూడ డీఎస్పీరాజశేఖర్‌రాజు, నాగార్జునసాగర్‌ సీఐ భీసన్న, పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు, పోలీస్‌ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అక్రమంగా నిల్వచేసిన బియ్యం పట్టివేత


శ్రీరేణుకా ఎల్లమ్మ ఫ్యామిలీ దాబాలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో ఓ దాబాలో అక్రమంగా నిల్వచేసిన 800 బస్తాల బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్‌(ఎస్‌) మండలం కోటినాయక్‌ తండాకు చెందిన శేషులాల్‌ చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో మూతపడిన శ్రీరేణుకా ఎల్లమ్మ ఫ్యామిలీ దాబాను కిరాయికి తీసుకున్నాడు. బియ్యం వ్యాపారి అయిన శేషులాల్‌ ఈ దాబా నుంచి వేరే ప్రాంతాలకు డీసీఎంలలో బియ్యాన్ని తరలిస్తున్నాడు. సోమవారం డీసీఎంలో బియ్యం లోడ్‌ వేస్తుండగా కొంతమంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తన సిబ్బందితో దాబా వద్దకు చేరుకుని బియ్యాన్ని పరిశీలించారు. కాగా ఎఫ్‌సీఐ తిరస్కరించిన బియ్యాన్ని తాను కొనుగోలు చేసి వాటిని నూకలుగా చేసి కోళ్లఫాంలకు విక్రయిస్తున్నట్లు వ్యాపారి తెలుపడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. 800 బస్తాల బియ్యాన్ని సీజ్‌ చేసి, బియ్యంలో కలిపేందుకు డీసీఎంలో తీసుకొచ్చిన తెల్ల కంకర పొడి బస్తాలను పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు సివిల్‌ సప్లై, టాస్క్‌ఫోర్స్‌ అధికారులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. పట్టుబడిన బియ్యం రేషన్‌ బియ్యం కాదని వారు నిర్ధారించి చెప్పడంతో కొన్ని శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కారం గ్రామానికి చెందిన ప్రశాంత్‌ బైక్‌పై రాజాపేట మండలం బొందుగుల గ్రామం మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని రాజాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం


బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న పోచంపల్లి బ్యాంకు చైర్మన్‌ తడక రమేశ్‌

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి కోఆపరేటివ్‌ అర్బన్‌ బ్యాంకులో ఖాతాదారులకు నాణ్యమైన సేవలందిస్తూ వారి మన్ననలు పొందుతున్నామని బ్యాంకు చైర్మన్‌ తడక రమేశ్‌ అన్నారు. ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన కప్పెర వెంకటయ్యతో పాటు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహేశ్వరం దత్తాత్రేయకు జీఏపీఏ పాలసీ కింద ఒక్కో కుటుంబానికి మంజూరైన రూ.లక్ష బీమా చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 నుంచి 70 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి బ్యాంకు ఖాతాదారుడికి బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్‌, వైస్‌ చైర్మన్‌ భారత రాజేంద్రప్రసాద్‌, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్‌, సూరెపల్లి రమేశ్‌, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, మక్తాల నర్సింహ, బిట్టు భాస్కర్‌, సీనియర్‌ మేనేజర్‌ రాచకొండ మధుసూదన్‌, బ్రాంచ్‌ మేనేజర్‌ రచ్చ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ


మహిళలకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: చిరుధాన్యాలతో ఉత్పత్తులు తయారు చేసి మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త ఎస్‌. సుగంధి అన్నారు. చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై గడ్డిపల్లి కేవీకేలో ఐదు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు మొదలగు వాటితో రాగి లడ్డు, జొన్న లడ్డు, జొన్న మురుకులు, చెక్కలు మరియు బేకరీ ఉత్పత్తులను తయారు చేయడంపై ప్రాక్టికల్‌ సెషన్‌ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు చిరుధాన్యాల ఉత్పత్తులను ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్‌, ఆదర్శ్‌ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్దిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 5వ రోజైన సోమవారం అమ్మవారిని శ్రీలక్ష్మీదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి సంప్రదాయంగా పూజలు జరిపించారు. ఉదయం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణములు, గాయత్రీ జపములు, సహస్రనామార్చన, మధ్యాహ్న పూజ నిర్వహించారు. సాయంత్రం 7.30గంటల నుంచి నవావరణ పూజ, మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాదం వినియోగం చేపట్టారు.

పురాతన శిలాశాసనాల పరిశీలన


వెల్మజాలలో శిలాశాసనాలను పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

గుండాల: మండలంలోని వెల్మజాల గ్రామంలోని శివుని బండపై గల శిలాశాసనాలను భారత పురావస్తు శాఖ డైరెక్టర్‌ రత్నాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిలాశాసనాలపై 13, 14వ శతాబ్దానికి చెందిన వీరులు దేవుడి మొక్కు కోసం జుట్టు పెంచి సిగ ముడివేసి మూడు పాయలుగా జుట్టు విడదీసి జడ అల్లినట్లుగా తెలుస్తుందని తెలిపారు. వీరుల శిల్పాలను వీరుగల్లులు అంటారని చెప్పారు. అనంతరం రణరంగంలో గ్రామ రక్షణ కోసం కడదాక నిలిచి ప్రాణాలు పోగొట్టుకున్న వీరుల శిల్పాలను కనుగొన్నట్లు పేర్కొన్నారు. 13, 14వ శతాబ్దపు శాసనంలో కలబడు అక్షరాలు ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌ దాస సుబ్రహ్మణ్యప్రసాద్‌, సుధీర్‌, వినోద్‌కుమార్‌ ఉన్నారు.

‘కంది’లో చీడపీడలు – నివారణ చర్యలు


కంది పంట

నడిగూడెం: ప్రస్తుతం సాగులో ఉన్న కంది పంట ఏపుగా పెరిగే దశలో ఉంది. ఈ దశ నుంచి కందిపై చీడపీడలు ఆశించి నష్టపరుస్తుంటాయి. ఈ సమయంతో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి పొందవచ్చని నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దేవప్రసాద్‌ చెబుతున్నారు. చీడపీడల నివారణపై ఆయన సలహాలు, సూచనలు..

ఆశించే పురుగులు

ఆకు గూడు పురుగు : ఈ పురుగు ఎదుగు దశలో, ఒక్కోసారి పూత దశలో కూడా ఆశిస్తుంది. లార్వాలు చిగురాకులను, ఆకులను గూడుగా చేసి, లోపల ఉండి ఆకులను తింటాయి. ఒక్కోసారి పువ్వులను, లేత కాయలను కూడా తింటాయి. అధిక వర్షపాతం నమోదైనప్పుడు పంట ఎదుగు దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది.

నివారణ: మోనోక్రోటోఫాస్‌ 1.6 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్‌ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పూత పెంకు పురుగు : ఎర్రటి లేదా నారింజ రంగు మచ్చలు, గీతలున్న నల్లటి పూత పెంకు పురుగులు కందిని పూత దశలో ఆశించి, మొగ్గలను తినడం వలన కాత శాతం తగ్గిపోతుంది. పూత సమయంలో మేఘావృతమైన వాతావరణ పరిస్థితులలో వస్తుంది. ఈ పురుగులను నివారించాలంటే ఉదయం పూట పురుగులను ఏరి నాశనం చేయాలి.

మారూకా మచ్చల పురుగు : తల్లి రెక్కల పురుగు కోడి గుడ్డు ఆకారం గల పసుపు పచ్చని గుడ్లని పూ మొగ్గలపై లేత ఆకులపై, పిందెలపై పెడుతుంది. గుడ్ల నుండి వెలువడిన లార్వాలు ఆకులను, పువ్వులను, కాయలను కలిపి గూళ్లుగా చేసి, మొగ్గలను, పిందెలను, కాయలను తొలిచి తింటాయి. తొలిచిన కాయ రంధ్రం దగ్గర లార్వా విసర్జితములు కనిపిస్తాయి.

నివారణ : క్లోరిపైరిఫాస్‌ 2.5 మి.లీ. ప్రొఫెనాఫాస్‌ 2 మి.లీ. లేదా నొవాల్యురాన్‌ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనోసిడ్‌ 0.3. మి.లీ. లేదా ఎమామెక్టిన్‌ బెంజోయేట్‌ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పొడిపంట

శనగపచ్చ పురుగు : తల్లి పురుగు లేత చిగుళ్లపై, పూ మొగ్గలపై, లేత పిందెలపై విడివిడిగా లేత పసుపు రంగు గుడ్లను పెడుతుంది. గుడ్ల నుండి వెలువడిన నార పురుగులు మొగ్గల్ని గికి తింటూ తర్వాత దశలో మొగ్గల్ని గోకి తింటూ తరువాత దశలో మొగ్గల్ని తొలిచి కాయలోకి తలను దూర్చించి మిగిలిన శరీరాన్ని బయటకు ఉంచి లోపల గింజలను తిని డొల్ల చేస్తాయి. పురుగు తిన్న కాయకి గుండ్రని రంధ్రాలు కనిపిస్తాయి.

నివారణ : ఫ్లూబెండమైడ్‌ 0.2 మి.లీ. లేదా ల్యామ్‌డాసైహాలోత్రిన్‌ 1 మి.లీ. లేదా థయోడికార్బ్‌ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆశించే తెగుళ్లు

ఎండు తెగులు : ఈ తెగులు సోకిన మొక్కలు పూర్తిగా కాని, మొక్కలో కొంత భాగం కానీ వాడి ఎండిపోతాయి. ఎండిన మొక్కలను పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. ఇది భూమిలో ఉండే శిలీంధ్రం ద్వారా వ్యాపిస్తుంది.

నివారణ : ఈ తెగులు నివారణకు మందులు లేవు. కాబట్టి తెగులును తట్టుకొనే రకాలు ఐసీపీఎల్‌-87119 లేదా ఐసీపీ 8868, డబ్ల్యూఆర్‌-97, డబ్ల్యూఆర్‌-93 రకాలను సాగు చేసుకోవాలి. ట్రైకోడెర్మా మిశ్రమం 10 గ్రాములు ఒక కిలో విత్తనాలకు కలిపి విత్తుకోవడం వలన కొంత వరకు ఎండు తెగులును నివారించవచ్చు.

ఫైటోఫ్తోరా ఎండు తెగులు : దీని ఆకులు, కొమ్మలు, కాండంపై నీటి చుక్కల మాదిరిగా ఏర్పడి తరువాత గోధుమ రంగుకు మారతాయి. తెగులు తీవ్రమైనచో కొమ్మలు, కాండం విరిగిపోతాయి. తొలిదశలో వచ్చినప్పుడు గుంపులు గుంపులుగా మొక్కలు ఎండిపోతాయి. ఈ తెగులు అధిక వర్షపాతం, నీరు నిలువ ప్రాంతాలలో ఎక్కువగా వస్తుంది. పైరు ఎదుగుదల దశల అధిక వర్షపాతము నమోదై, మురుగు నీరు పోయే వసతి సరిగ్గా లేని ప్రాంతాలలో ఎక్కువ వస్తుంది.

నివారణ : మాంకోజెబ్‌ 3 గ్రాములు లేదా మెటలాక్సిల్‌ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా మొక్క మరియు వాటి చుట్టూ ఉన్న మొక్కలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

స్టెరిలిటీ మొజాయిక్‌ తెగులు : ఈ తెగులు సోకిన మొక్క లేత ఆకుపచ్చరంగు గల చిన్న ఆకులను విపరీతంగా తొడుగుతుంది. పూత పూయదు. ఈ తెగులు నల్లి ద్వారా వ్యాపిస్తుంది. బెట్ట వాతావరణ పరిస్థితులు అనుకూలం. ఆలస్యంగా విత్తిన కంది పంటలో ఎక్కువగా ఆశిస్తుంది.

నివారణ : గంధకపు పొడి 3గ్రాములు లీటరు నీటికి లేదా డైకోఫాల్‌ 4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తట్టుకొనే రకాలైన ఐసీపీఎల్‌-87119, ఐసీపీఎల్‌ 8506 రకాలను సాగు చేసుకోవాలి.

- వేసవిలో లోతైన దుక్కులు చేయాలి.
- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు అమర్చాలి.
- ఎకరానికి 8 నుండి 10 పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలి.
- బంతి పూల మొక్కలను ఎర పంటగా వేయాలి.

కెనడాలో బతుకమ్మ వేడుకలు



కెనడా దేశంలోని ఒంటారియో రాష్ట్రం బ్రాంట్‌ఫోర్డ్‌ సిటీలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు మహిళలు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. ది గ్రేటర్‌ బ్రాంట్‌ ఫోర్డ్‌ సిటీ తెలుగు అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మేళ్లచెరువు, హుజూర్‌నగర్‌, ఖమ్మం తదితర ప్రాంతాలకు చెందిన నళిని, విజయ, జోత్స్న, పద్మ తదితరులు తమ ఇళ్ల వద్ద రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఒక్క చోట చేరి ఆడిపాడారు. – హుజూర్‌నగర్‌









సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ గజం 2500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్‌ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్‌, కాటేజీ, 30 పండ్ల మొక్కలు 30 ఎర్రచందనం మొక్కలతో 5 &10 గుంటల ప్లాట్స్‌ అమ్మబడును. దసరా ఆఫర్‌ 10 గ్రా॥ గోల్డ్‌ కలదు. సంప్ర: 6304222202 [G-3174]

HOUSE FOR SALE

■ ఉత్తమ డ్యూప్లెక్స్‌ లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉంది ! మిర్యాలగూడలో 2, 3 & 4BHK విల్లాలు, D-మార్ట్‌ పక్కన. ఆధునిక సౌకర్యాలను ఆస్వాదించండి. క్లబ్‌ హౌస్‌, స్విమ్మింగ్‌ పూల్‌, మస్ట్‌ విజిట్‌. Ph: 7013578378 [HA-732]

Education

EDUCATION

■ మా వద్ద BA లో తెలుగు, హిందీ Lit కొరకు ఓపెన్‌ 10th, ఇంటర్‌, డిగ్రీ, పి.జి, MBA, B.Tech, LLB, ITI డిప్లమా, ఫార్మసీ, B.Ed, B.PEd. అ.కై. సంప్ర॥ 9948131154. కోదాడ. [Y-1124891]

Services

MEMO MISSING

■ AA 449899 నెంబరు గల నాయొక్క SSC ఒరిజినల్‌ మెమో ఒక సంవత్సరం క్రితం నేను హట్యాతండ నుండి గూడూరుకి వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు. ధీరావత్‌ లాలు S/o సక్యానాయక్‌ గ్రా॥ హట్యాతండ - కొత్తగూడెం, మం॥ మిర్యాలగూడెం. ఫోన్‌ : 9494591588 [Y-798507]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.